# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 155 క్రిష్ణా, ఆదివారం 01- 03 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


# ప్రతి ఒక్కరికీ 2.5 లక్షల ఆరోగ్య బీమా

**గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉచిత వ్యాక్సిన్**
**పోలవరం నీళ్లు వంశధారకు తీసుకొస్తా**
**జగన్ హయాంలో టీటీడీ పవిత్రతకు దెబ్బ**
**నాటికి, నేటికి 'లడ్డూ'లో తేడా భక్తులే చెబుతున్నారు**
**విజయనగరం జిల్లా పర్యటనలో చంద్రబాబు**
**చేతల్లో మా అభివృద్ధి: లోకేశ్**
**బ్లూ జెట్ హెల్త్‌కేర్ ఫార్మా కంపెనీకి భూమి పూజ**



క్రైం కౌంటర్ న్యూస్, విజయనగరం, ఫిబ్రవరి 28 రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ రూ. 2.5 లక్షల ఆరోగ్య బీమా అందించనున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావివలసలో శనివారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. బీమా పథకానికి సంబంధించి విధివిధానాలు తయారుచేశామని, తుది కసరత్తు జరుగుతోందని, త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. పేదవారు ఎక్కడుంటే తాను అక్కడుంటానని, పేదరికం నిర్మూలనే లక్ష్యంగా సంస్కరణలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. పేదరికం నిర్మూలనకే సూపర్ సిక్స్ పథకాలు అని తెలిపారు. 1న సెలవు దినం వస్తే ముందురోజే పింఛన్లు అందించి, చిత్తశుద్ధి నిలుపుకొంటున్నట్టు చెప్పారు. "గర్భాశయ క్యాన్సర్‌లు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఏపీలో 3,40,154 మందికి ఈ రకమైన రుగ్మతలు ఉన్నట్టు తేలింది. దేశవ్యాప్తంగా వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో కేంద్రం 14, 15 ఏళ్ల బాలికలకు రూ.4,400 విలువచేసే వ్యాక్సిన్‌ను రూ.400కే అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఉచితంగా అందించే ఏర్పాటు చేస్తోంది. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. త్వరలో వాట్సాప్ ద్వారా ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో ఎవరికి వారుగా తమ ఆరోగ్య పరిస్థితిని, వివరాలను తెలుసుకోవచ్చు. ఏపీని గంజాయి లేని రాష్ట్రంగా మార్చుతాం. గంజాయి మాఫియాను ఉక్కుపాదంతో అణచివేస్తాం. ఫ్యాక్షనిజాన్ని అణిచివేశాం." అని సీఎం తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

నదుల అనుసంధానం..

"నదుల అనుసంధానానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పోలవరం నీటిని వంశధారకు తీసుకురావాలన్నదే మా లక్ష్యం. ఇప్పటికే పోలవరం నీరు అనకాపల్లి వరకూ వచ్చింది. దాన్ని శ్రీకాకుళం వరకూ తీసుకెళతాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు అందించాలన్నదే లక్ష్యం. రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి పెద్దపీట వేశాం. తిరుమల ప్రతిష్ఠను, పవిత్రతను గత వైసీపీ ప్రభుత్వం మంటగలిపింది. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసింది. నాణ్యత లేని నెయ్యితో లడ్డూ తయారుచేసి పాపాన్ని మూటగట్టుకున్నారు. వారిని దేవదేవుడు అస్సలు క్షమించడు. వైసీపీ హయాంలో టీటీడీ లడ్డూకు.. ఇప్పుడు తయారవుతున్న లడ్డూకు చాలా వ్యత్యాసం ఉందని భక్తులే చెబుతున్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేను 2047 విజన్‌తో పనిచేస్తున్నా. గతంలో ఐటీ అభివృద్ధి చేశా. ఇప్పుడు ఏఐకి ప్రాధాన్యం ఇస్తున్నా. అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించాలి" అని చంద్రబాబు కోరారు. మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే కళా వెంకటరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబానికి అండగా...

**తల్లిదండ్రులులేని అక్కాచెల్లెళ్లకు సీఎం చంద్రబాబు అండ**



చీపురుపల్లి, ఫిబ్రవరి 2 తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఇద్దరు అక్కా చెల్లెళ్లకు సీఎం చంద్రబాబు అండగా నిలిచి పెద్ద మనసు చాటుకున్నారు. చీపురుపల్లి మండలం రేగిడిపేటకు చెందిన రేగిడి హారిక, అఖిల పేరున చెరో 3లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నట్టు ప్రకటించారు. పీ4లో భాగంగా గరివిడి మండలం కొండదాడి గ్రామానికి చెందిన మార్గదర్శి పి.సాయి గోపాలవర్మ... వారిని దత్తత తీసుకుని చదివిస్తున్నారు. ఆయన్ను సీఎం అభినందించారు. అంతకుముందు పైలపేటలో రొంగలి ఎల్లయ్య నివాసానికి వెళ్లి పింఛను అందజేశారు.

## క్రైమ్ కౌంటర్ పత్రిక వారి ఆహ్వానం....

3-3-2026 అనగా హోలీ పండుగ రోజున.. సత్తెనపల్లి పల్నాడు జిల్లా.. సత్తెనపల్లిలో క్రైమ్ కౌంటర్ దినపత్రిక కార్యాలయము దగ్గర .చలివేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుంది... ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా సంబంధించిన . ప్రముఖులు వచ్చుచున్నారు కనుక. క్రైమ్ కౌంటర్ పత్రిక విలేకరులు మరియు అభిమానులు. మిత్రులు. శ్రేయోభిలాషులు. అందరూ వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా.. మనవి.

మీ..... ఎడిటర్..

# పేలిన ప్రాణాలు

**గోదావరి జిల్లా'లో మరో బాణసంచా విషాదం**
**21మంది బుగ్గి**
**10 మందికి గాయాలు**
**కాకినాడ జిల్లా వేట్లపాలెంలో భారీ విస్ఫోటం**
**శివారు పొలాల మధ్య సూర్యశ్రీ ఫైర్ వర్క్స్**
**సింగారమ్మ జాతర కోసం భారీగా ఆర్డర్**
**తయారీ పనిలో నిమగ్నమైన కార్మికులు**
**చిచ్చుబుడ్లలో మందు కూరుతుండగా నిప్పు**
**నారబాంబులకు అంటుకొని వరుస పేలుళ్లు**
**8 కిలోమీటర్ల వరకూ వినిపించిన శబ్దం**
**అర కిలోమీటరు ఎగిరి పడిన మృతదేహాలు**
**గుర్తుపట్టలేనంతగా కాలి, ముక్కలైన శరీరాలు**




క్రైం కౌంటర్ న్యూస్, కాకినాడ/సామర్లకోట అది... కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం శివారు! గోదావరి కాలువ అవతల పచ్చని పొలాల మధ్య... సూర్యశ్రీ ఫైర్ వర్క్! శనివారం మధ్యాహ్నం 2.10 గంటలు! శుభకార్యాలు, జాతర్ల కోసం భారీగా బాణసంచా తయారు చేయడంలో కార్మికులు నిమగ్నమయ్యారు. అంతలోనే... ఒక్కసారిగా పెను విస్ఫోటం! ఎనిమిది కిలోమీటర్ల దూరానికీ వినిపించిన శబ్దాలు! భూకంపం వచ్చిందా అన్నంతగా కంపించిన పరిసరాలు! వరుసగా పేలుళ్ల మీద పేలుళ్లు జరుగుతూనే ఉన్నాయి. 20 మీటర్ల ఎత్తుదాకా మంటలు ఎగిసి పడ్డాయి. పేలుళ్ల ధాటికి అక్కడికక్కడే 21 మంది చనిపోయారు. బాణసంచా తయారీ కేంద్రానికి సంబంధించిన రెండు షెడ్లు కుప్ప కూలిపోయాయి. కార్మికులకు సంబంధించిన ద్విచక్ర వాహనాలు ముక్కలు ముక్కలుగా విడిపోయాయి. సినిమాల్లో చూపినట్లుగా సైకిళ్లు గాలిలోకి ఎగిరి కిందపడ్డాయి. ఇనుప డ్రమ్ములు, స్తంభాలు తుత్తునియలయ్యాయి. పేలుడు తీవ్రత తెలుపుతూ... ఆ ప్రాంతమంతా మరుభూమిని తలపించింది.

అసలేం జరిగింది...

వేట్లపాలెంలోని సూర్యశ్రీ ఫైర్ వర్క్ బాణసంచా తయారీ కేంద్రం బాణాసంచా తయారీకి ప్రసిద్ధి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శుభకార్యాలు, జాతరలు, పండగలకు ఇక్కడి నుంచే బాణసంచా వెళ్తుంది. అడబాల శ్రీను అనే వ్యక్తి తన ఇద్దరు కుమారులు అడబాల వీరబాబు, అర్జున్ పేర్లతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. తాజాగా... జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం సింగారమ్మ చింత అమ్మవారి ఉత్సవాలకోసం భారీ ఆర్డరు వచ్చింది. దీంతో తాత్కాలికంగా మరికొందరు కార్మికులను నియమించుకున్నారు. సామర్లకోట, వేట్లపాలెం, మేడపాడు తదితర ప్రాంతానికి చెందిన సుమారు 70 మంది శనివారం బాణసంచా తయారీ పనికి వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి వారిలో దాదాపు సగంమంది భోజనానికి వెళ్లారు. మిగిలిన వారంతా పనిలో నిమగ్నమయ్యారు. వివిధ వర్గాల కథనం ప్రకారం... కలర్ చిచ్చుబుడ్ల తయారీ దగ్గరే తొలి చిచ్చు పుట్టింది.

2లో

# ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లు



**నిరుపేదలకు అవకాశం**
**ఒకటో తరగతిలో నాలుగో వంతు కేటాయింపు**
**అంతా లాటరీ ద్వారానే...**
**వచ్చేనెల 10వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ**
**జిల్లాలో 650 ప్రైవేటు పాఠశాలలు**
**అందుబాటులో ఆరు వేలకుపైగా సీట్లు**

క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, ఫిబ్రవరి 28 రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు పాఠశాల విద్యా శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. విద్యాహక్కు చట్టం-2009 సెక్షన్ 12(1) సి ప్రకారం పేద వర్గాలకు చెందిన పిల్లలకు ప్రతి ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించాలి. ఇందుకోసం ఈ నెల 20 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందగోరే బాలుడు/బాలిక వయస్సు సీబీఎస్ఈ సిలబస్ అయితే 2020 ఏప్రిల్ 2 నుంచి 2021 మార్చి 31వ తేదీ మధ్య జన్మించి ఐదేళ్లు నిండాలి. రాష్ట్ర సిలబస్‌లో అయితే 2020 జూన్ 2 నుంచి 2021 మే 31 తేదీ మధ్య జన్మించి ఐదేళ్లు నిండి ఉండాలి. పిల్లల కోసం దరఖాస్తు చేసే తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.44 లక్షలలోపు, బియ్యం కార్డు కలిగి ఉండాలి. ఆధార్ కార్డులో ఉన్న ఇంటి అడ్రస్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. ఆ ప్రకారం బాలబాలికల తల్లిదండ్రులు నివసించే ఇంటికి సమీపంలో ఉన్న సచివాలయ పరిధిలో ఉన్న పాఠశాలల్లో సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలి. కిలోమీటరు నుంచి ఐదు కి.మీ. పరిధిలో గల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి. మద్రిపాలెంలో నివసించే బాలబాలికల కోసం దగ్గర విశాఖ వ్యాలీ స్కూలుకు దరఖాస్తు చేసుకోవచ్చుగానీ తొలుత సదరు స్కూలుకు దగ్గరలో ఉన్న పిల్లలకు సీట్లు కేటాయించిన తరువాత మిగిలితే అవకాశం ఇస్తారు. ఇంకా సీటు కేటాయించే సమయంలో తండ్రి కులం మాత్రం ప్రామాణికంగా తీసుకుంటారు. వచ్చే నెల 17వ తేదీన సచివాలయాల్లో ఉన్న డేటా ప్రకారం దరఖాస్తుదారుల అర్హత నిర్ధారిస్తారు. అనంతరం ప్రత్యేకంగా తయారుచేసిన సాఫ్ట్‌వేర్ ద్వారా 25వ తేదీన తొలివిడత లాటరీ తీస్తారు. దీని ప్రకారం సీట్లు పొందిన బాలబాలికలు వచ్చే నెల 26 నుంచి ఏప్రిల్ ఏడో తేదీలోగా ఆయా పాఠశాలల్లో ప్రవేశాలను ధ్రువీకరించాలి. ఆ తరువాత మిగిలిన సీట్లకు ఏప్రిల్ 12న రెండో విడత లాటరీ తీస్తారు. వీరు ఏప్రిల్ 13 నుంచి 23వ తేదీలోగా ప్రవేశాలు పొందాలి.

జిల్లాలో ఆరు వేలకుపైగా సీట్లు విశాఖ జిల్లాలో 650 ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో సుమారు 25 వేల సీట్లు ఉన్నాయి. వాటిల్లో నాలుగో వంతు అంటే ఆరు వేల సీట్లు వరకూ ఉచితంగా పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు కేటాయించే అవకాశం ఉంది. గత ఏడాది జిల్లాలో 6,143 మందికి సీట్లు కేటాయించారు. అయితే పలు కారణాల వల్ల 2,724 మంది అర్హత కోల్పోగా, 3,419 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. అందువల్ల దరఖాస్తు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. తాము నివసించే ప్రాంతంలోని సచివాలయానికి దగ్గరలో ఉన్న పాఠశాలలో సీటు కోసమే దరఖాస్తు చేయాలి. ఒకవేళ సదరు స్కూలు నచ్చకపోతే దరఖాస్తులో దాని ప్రస్తావన లేకుండా జాగ్రత్తపడాలని చెబుతున్నారు. ఒకసారి లాటరీలో సీటు పొందిన తరువాత మరో పాఠశాలలో సీటు లభ్యం కాదు. ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసేవారంతా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖర్‌రావు సూచించారు.

# పేలిన ప్రాణాలు

ఈ చిచ్చుబుడ్లలో మందు కూరేందుకు మెల్లగా సుత్తితో కొడతారు. ఆ సమయంలోనే నిప్పు రవ్వ రాజుకుంది. అది పక్కనే ఉన్న 'సెర్చ్ లైట్' అనే మరోరకం బాణసంచాపై పడింది. మెల్లగా పేలుడు మొదలైంది. అక్కడికి దగ్గరే వందల సంఖ్యలో 'నార బాంబులు' (బ్యాటరీ బాంబులు) ఉన్నాయి. వాటికీ మంట అంటుకుంది. దీనికి తోడు... తమిళనాడు నుంచి తెప్పించిన పేలుడు రసాయనం రెండు డ్రమ్ముల్లో నిండుగా ఉంది. ఇంకేముందీ... యుద్ధంలో బాంబులు కురిపిస్తున్నట్లుగా పేలుళ్లు మొదలయ్యాయి. ఆగకుండా... పేలుతూనే ఉన్నాయి. వందల సంఖ్యలో ఉన్న నారబాంబుల వల్లే పేలుళ్ల తీవ్రత ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ఆ ప్రాంతం గోదావరి కాలువకు ఆవల, పొలాల మధ్య ఉండటంతో... తక్షణ సహాయం అందే దిక్కూ లేకుండా పోయింది. పెద్ద ఎత్తున ఎగసి పడుతున్న మంటలు, బాణసంచా పేలుడు, దట్టమైన పొగ కారణంగా... లోపలికి వెళ్లలేకపోయామని, అప్పటికే అక్కడున్న చాలామంది ప్రాణాలు కోల్పోయారని స్థానికులు తెలిపారు.

హుటాహుటిన..

భారీ విస్ఫోటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎస్పీ బిందుమాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, కాకినాడ, పెద్దాపురం ఆర్డీఓలు, డీఎస్పీలు, సీఐలు.... ఇలా అందరూ సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం నుంచి పెద్ద ఎత్తున ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపు చేశాయి. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాల గుర్తింపు, ఆసుపత్రులకు తరలింపు వంటి వ్యవహారాలను ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.

మళ్లీ... మళ్లీ... పేలుడు

మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.30 గంటల దాకా ఫైరింజన్లతో మంటలు ఆర్పుతూనే ఉన్నారు. ఈ క్రమంలో బాణసంచా తయారీ కేంద్రంలో ధ్వంసమైన ఒక రేకులషెడ్డు, కాంక్రీట్ భవనం అడుగున సగం కాలకుండా ఉన్న మందుగుండు మళ్లీ పేలింది. ఆ సమయంలో... కలెక్టర్, ఎస్పీ అక్కడే ఉన్నారు. పేలుడు ధాటికి పరుగులు తీశారు.

మాంసపు ముద్దలుగా...

పేలుళ్ల తీవ్రతకు మృతదేహాలు బొగ్గులుగా మారిపోయాయి. చిందరవందరగా పడిపోయాయి. ఏ మృతదేహం ఎవరిదోకూడా గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. తల, కాళ్లు చేతులు తెగిపడి ఎగిరి... పక్కనే ఉన్న పొలాల్లో మాంసపు ముద్దలు పడ్డాయి. మరికొందరైతే... ఉన్నచోట ఉన్నట్లుగానే బుగ్గి అయ్యారు. మృతుల్లో కొంతమందిని అతికష్టంపై వెతికి పోలీసులు, స్థానికులు గుర్తించారు. ఘటనా స్థలానికి ఐదారువందల మీటర్ల దూరంలోనూ గోదావరి కాలువ గట్టుపై తలలేని మొండెం కనిపించింది. ముద్దలు ముద్దలుగా, తునాతునకలైన మృతదేహాలను ఒకచోట చేర్చి స్ట్రెచర్ మీద ఎక్కించేందుకు ఫైర్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సైతం వణికిపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని మృతదేహాలను అతికష్టం మీద గుర్తించగా... గుర్తుపట్టలేని మృతదేహాలకు నంబర్లు వేసి సామర్లకోట మార్చురీకి తరలించారు.

వేట్లపాలెం దుర్ఘటన మృతులకు పోస్టుమార్టం పూర్తి

కాకినాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రం సూర్య శ్రీ ఫైర్ వర్క్సులో జరిగిన ఘోర ప్రమాద దుర్ఘటనలో మరణించిన కూలీల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేశారు. శనివారం రాత్రి మృతుల కుటుంబీకులు, బంధువులకు అధికారులు మృతదేహాలను అప్పగించారు. అంత్యక్రియల ఖర్చు కింద 25 వేల రూపాయల చొప్పున అందజేశారు.

## కాకినాడ పేలుడు ఘటన,,,

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 28: ఛిద్రమైన శరీర భాగాలు.. ముక్కలు ముక్కలుగా తెగిపడి, పంటపొలాల్లో చెల్లాచెదురుగా విసిరివేయబడిన మృతదేహాలు.. ఏ భాగం ఎవరిదో తెలియదు.. మిన్నంటిన ఆక్రందనలు.. తమ వారి కోసం కుటుంబసభ్యుల గాలింపులు.. మొత్తంగా భీతావహ వాతావరణం.. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన బాణాసంచా పేలుడు ఘటన.. తెలుగు రాష్ట్రాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. శనివారం మధ్యాహ్నం సమయంలో జరిగిన ఈ ప్రమాదం.. రెండు రాష్ట్రాలను ఉలిక్కిపడేలా చేసింది. ఈ పేలుడులో 21 మంది చనిపోయినట్లు భావిస్తున్నారు. అయితే ఇంతమంది చనిపోవటానికి.. ప్రమాద తీవ్రత ఇంతగా పెరడానికి అనేక కారణాలు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు.

ప్రమాద తీవ్రత పెరగడానికి కారణాలు

ప్రమాద తీవ్రత పెరడానికి అతి భారీ పేలుడు ఒక కారణమైతే.. రెండు గంటల పాటూ పేలుళ్లు కొనసాగడం మరో కారణం. దీంతో స్థానికులు, చుట్టుపక్కల జనం ఎవరూ కూడా ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లలేకపోయారు. చివరకు కొంతమంది ధైర్యం చేసి వెళ్లేటప్పటికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. చాలా మంది మంటల్లో సజీవదహనమయ్యారు. ముక్కలు ముక్కలుగా శరీరభాగాలు తెగిపడిపోయాయి. దీనికి తోడు ప్రమాదం జరిగిన సూర్య శ్రీ ఫైర్ వర్క్స్.. వరిపొలాల మధ్యలో ఉంది. దీంతో ప్రమాదం జరిగిన తర్వాత అంబులెన్స్, ఫైరింజన్లు వెళ్లడానికి సరైన మార్గం లేకపోయింది. పొలాలు అన్నీ బురదమయంగా ఉండటం కూడా ఆలస్యానికి కారణమైంది.

పరారీలో యజమాని.. సహాయక చర్యలకు అనుకూలించని ఇలాంటి పరిస్థితులలో అతి కష్టమ్మీద అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో 15 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. వీరిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఇక పేలుడు ఘటన తర్వాత సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ యజమాని పరారైనట్లు అధికారులు వెల్లడించారు. పొలాల్లో షెడ్లు వేసి బాణసంచా తయారుచేస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వేట్లపాలెం పేలుడు.. చనిపోయినవారి వివరాలు మరోవైపు ప్రమాదంలో చనిపోయినవారిలో ఇప్పటి వరకూ 13 మందిని గుర్తించారు. కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, అడబాల శ్రీను, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, నిమ్మద కరుణ, మందపల్లి చిన్ని, గంపల మంగ,గొడతా రాము, గొడతా నాని, గొడతా మహేశ్ మృతదేహాలను ఇప్పటి వరకూ గుర్తించారు. పోస్టుమార్టమ్ కోసం ఆస్పత్రికి తరలించారు.

# ప్రజా సమస్యలు పై విస్తృత పర్యటన లక్ష్యం గా బి.జే.పీ.జనతా వారధి





ఏలూరు జిల్లా ముదినేపల్లి:::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి :: ప్రజా సమస్యలు పై విస్తృత పర్యటన లక్ష్యం గా బి.జే.పీ.జనతా వారధి ప్రజా సమస్యలు పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ జనతా వారధి అర్జీల ద్వారా అధికారులకు తెలియచేసి ప్రజా సమస్యలు పరిష్కరించటానికి దోహాద పడటానికి ప్రభుత్వానికి అధికారుల ద్వారా తెలియ చేయటానికి బి.జే.పీ.నాయకులు,కార్యకర్తలు కలిసికట్టుగా జనతా వారది ద్వారా సమస్యలు నమోదుచేసి ప్రజలకు న్యాయం జరిగేలా ప్రయత్నించాలని పిలుపునిచ్చిన మీదట కైకలూరు నియోజకవర్గ ఏం.ఎల్.ఏ.కామినేని శ్రీనివాస్ ఆదేశాలతోనూ,రాష్ట్ర పార్టీ సూచనలతో ముదినేపల్లి మండలంలో కోటప్రోలు కృష్ణ,నాయకులు,కార్యకర్తలతో గ్రామ,గ్రామాలు తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకొంటూ ఏం.ఎల్.ఏ.కామినేని దృష్టికి తీసుకువెళ్లి,ఏలూరు జిల్లా నాయకులకి,రాష్ట్ర పార్టీ కార్యాలయం కి,అధికారులకి తెలియచేసి త్వరితగతిన న్యాయం చేయిస్తామని, నేటికీ 10 రోజులుగా కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు నరేంద్ర మోడీ ఇస్తున్న పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, బి.జే.పీ.పార్టీని ముదినేపల్లి మండలం లో మరింత బలోపేతం చేసన్తూ,రానున్న గ్రామ,నగరపాలక,పురపాలక,జిల్లా పరిషత్,ఏం.పీ.టీ.సీ. ఎన్నికలలో బి.జే.పీ.పార్టీ కి అఖండ మెజారిటీ తో గెలిపించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమం లో బి.జే.పీ.మండలాధ్యక్ష్యురాలు సత్యవోలు నాగలక్ష్మి, ముదినేపల్లి మండలం లోని నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# జీవీఎంసీ చివరి సర్వసభ్య సమావేశంలో గళం విప్పిన సభ్యులు

**ఐదేళ్ల కాలంలో చేసిన పనులకు శిలాఫలాకాలు ఏర్పాటు చేయాలని కొందరి డిమాండ్**

**పారిశుధ్యం, వీధి దీపాల సమస్యలు ప్రస్తావించిన మరికొందరు**

**స్టాండింగ్ కౌన్సిల్ పనితీరుపై అసంతృప్తి**

**కుక్కలు, పందుల స్వైరవిహారంపై ఆందోళన**

**తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు మేయర్ ఆదేశం**

**68 అంశాలపై సభలో చర్చ...అన్నింటికీ ఆమోదం**



క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, ఫిబ్రవరి 28 గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పాలకవర్గ చిట్టచివరి సమావేశంలో సమస్యలను సభ్యులు ఏకరువు పెట్టారు. జీవీఎంసీ పాలకవర్గ పదవీకాలం మార్చి 15వ తేదీతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో చివరి సర్వసభ్య సమావేశాన్ని శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావలసి ఉండగా అర్ధగంట ఆలస్యమైంది. సమావేశం ప్రారంభమైన అనంతరం జీరో అవర్‌లో పలువురు సభ్యులు మాట్లాడుతూ కార్పొరేటర్లుగా తమకు అవకాశం కల్పించిన ఓటర్లు, పార్టీ ముఖ్య నాయకులకు కృతజ్ఞతలను తెలుపుతూ భోవోద్వేగానికి లోనయ్యారు. అనంతరం సమస్యలను ప్రస్తావించారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వార్డుల్లో చేసిన పనులకు సంబంధించి శిలాఫలకాలను చాలాచోట్ల ఏర్పాటు చేయలేదని పలువురు సభ్యులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ఐదేళ్ల పదవీకాలం ముగుస్తోందని, ఇప్పటికైనా శిలాఫలకాలను ఏర్పాటుచేస్తే తాము చేసిన పనులపై స్థానిక ప్రజలకు స్పష్టత లభిస్తుందని పేర్కొన్నారు. తొలుత ఈ విషయాన్ని వైసీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు ప్రస్తావించగా, ఆ తరువాత మరికొందరు సభ్యులు అదే విషయం మాట్లాడారు. 78వ వార్డులో ఉన్న డంపింగ్ యార్డు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీనివాస్ సభ దృష్టికి తీసుకువచ్చారు. దానిని మరోచోటకు తరలించాలని ఆయన కోరారు. గంగవరం పోర్టు నుంచి విపరీతమైన కాలుష్యం వస్తోందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, పద్మశ్రీ డాక్టర్ ఆదినారాయణ విగ్రహాలను ఏర్పాటు చేయాలని జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు కోరారు. జీవీఎంసీ పాలకవర్గం గడువు ముగిసిన వెంటనే జాప్యం లేకుండా ఎన్నికలు నిర్వహించేలా తీర్మానం చేయాలని సీపీఎం కార్పొరేటర్ గంగారావు కోరారు. గంగవరం పోర్టు వల్ల తీవ్రమైన కాలుష్యం వెదజల్లడంతోపాటు హెవీ వెహికల్స్ వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రత్యామ్నాయం ఆలోచించాలని ఆయన కోరారు. శానిటేషన్ వర్కర్ల కొరతతో పారిశుధ్య సమస్య తలెత్తుతోందని జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, బీజేపీ కార్పొరేటర్ గంగుల కవిత ఆందోళన వ్యక్తంచేశారు. సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ మాట్లాడుతూ కణితి రోడ్డుకు రూ.13 కోట్లు మంజూరు చేశారని, రెండు, మూడు రోజుల్లో భూమి పూజ చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. 86వ వార్డులో 40 శాతం మంది అపార్టుమెంట్ వాసులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. జీవీఎంసీ పరిధిలో కోట్లాది రూపాయలు వెచ్చించి శ్మశాన వాటికలు అభివృద్ధి చేశామని, వాటిలో కేర్ టేకర్లను నియమించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని టీడీపీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు.

పెద్దలకు రాయితీలు.. పేదలపై పన్నుల పిడుగు

జీరో అవర్ అనంతరం భోజన విరామం తీసుకున్న సభ్యులు తిరిగి సాయంత్రం 3.30 గంటలకు సమావేశ మందిరంలోకి వచ్చారు. ఈ సందర్భంగా 37 అంశాలతో కూడిన ప్రధాన అజెండా, మరో 31 అంశాలతో కూడిన టేబుల్ అజెండా సభ ముందుంచగా, కొన్నింటిపై సభ్యులు అభ్యంతరాలు వ్యక్తంచేశారు. పలువురు కార్పొరేటర్లు తమ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రధాన అజెండాలోని అంశాలపై సందేహాలను వ్యక్తం చేయగా, అధికారులు నివృత్తి చేశారు. ప్రధాన అజెండాలోని ఆరో అంశమైన రోడ్లపై సంచరించే శునకాలు, పందులు, పశువుల నియంత్రణపై విస్తృతమైన చర్చ జరిగింది. కుక్కలను ఉదయం తీసుకువెళ్లి మళ్లీ సాయంత్రం తీసుకువచ్చి అక్కడే వదిలేస్తున్నారని, ప్రతి వీధిలో 20కుపైగా పందులు ఉంటున్నాయని టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు పేర్కొన్నారు. పిల్లలను కుక్కలు కరుస్తున్నాయని, బైక్‌పై వెళుతుంటే వెంట పడుతున్నాయని మరికొందరు కార్పొరేటర్లు వాపోయారు. దీనిపై స్పందించిన మేయర్ పీలా శ్రీనివాసరావు కూడా పందులు, కుక్కల విషయంలో యంత్రాంగం తీరు పట్ల అసహనాన్ని వ్యక్తం చేశారు. గాజువాక ప్రాంతంలో ఎక్కువగా పందుల పెంపకం జరుగుతోందని, ముగ్గురు వ్యక్తులు నగరమంతా ఈ వ్యాపారాన్ని చేస్తున్నారని, వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఇన్‌స్పెక్టర్ల దగ్గర నుంచి పెంపకందారులకు సమాచారం వెళుతోందని, దీనిని సీరియస్‌గా తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. అనంతరం 35వ అంశంపై సభలో సుమారు రెండు గంటలపాటు విస్తృత చర్చ జరిగింది. జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ పనితీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వంద కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, పరిష్కరించేందుకు లీగల్ టీమ్ లేదన్నారు. అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశాన్ని ఏర్పాటుచేసి ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు. జ్ఞానాపురం వద్ద నడుస్తున్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ యాజమాన్యం జీవీఎంసీకి రూ.ఐదు కోట్లు చెల్లించకుండా ఎగ్గొటిందని సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ సభకు తెలియజేశారు. జీవీఎంసీకి అనేకమంది ఫీజులు ఎగ్గొడుతున్నారని, ఆయా కేసులు వాదించడంలో న్యాయవాదులు విఫలమవుతున్నారన్నారు. దీనిపై కమిషనర్ వివరణ ఇస్తూ..పట్టణ పురపాలక శాఖకు ఒకే ఒక ఎమ్మెస్సీ ఉన్నారని, ఆయన రాష్ట్ర వ్యాప్త కేసులను చూడాల్సి వస్తోందన్నారు. ఇనార్బిట్‌మాల్ నిర్మాణంలో అనేక అవకతవకలు ఉన్నాయని, ఇటీవల ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వడంలో భారీ అవినీతి జరిగిందని మూర్తియాదవ్ ఆరోపించారు. బీచ్ రోడ్డులో వీఎల్‌టీ లేకుండా 26 ఫ్లోర్ల నిర్మాణానికి వరుణ్ సంస్థకు డీటీసీపీ అనుమతి ఇవ్వడంపై అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. అనంతరం 31 అంశాలతో కూడిన టేబుల్ అజెండాపై సభ్యులు చర్చించారు. టేబుల్ అజెండాలో 29వ అంశం...వెలంపేట మురికవాడ అభివృద్ధిపై జరిగింది. పీపీపీ ముసుగులో విలువైన స్థలాలు ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడంపై మరోసారి సమీక్షించాలని పలువురు సభ్యులు కోరారు. దశల వారీగా ఎన్ని స్లమ్స్‌ను అభివృద్ధి చేయనున్నారో చెప్పాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ పీపీపీ విధానంలో చేస్తున్నామని, రూ.2.5 లక్షలు లబ్ధిదారులు, రూ.2.5 లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయన్నారు. నగర పరిధిలో ఎన్ని మురికివాడలు ఉన్నాయని మూర్తియాదవ్ ప్రశ్నించగా 66 ఉన్నాయని, అందులో 50 రాష్ట్ర ప్రభుత్వ స్థలాల్లో ఉండగా, 16 కేంద్ర ప్రభుత్వ స్థలాల్లో ఉన్నాయని కమిషనర్ బదులిచ్చారు. ప్రధాన అజెండాలోని 37 అంశాలు, టేబుల్ అజెండాలోని 31 అంశాలను అభ్యంతరాలు లేకుండా చర్చలు, సూచనలు ద్వారా సభ ఆమోదించింది.

స్పోర్ట్స్ వద్దు..టూర్‌కు పట్టు.. సభ్యులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రకటించారు. దీనిపై పలువురు మహిళా సభ్యులు క్రీడా పోటీలు వద్దని, టూర్‌కు తీసుకువెళ్లాలని కోరుతూ మేయర్, కమిషనర్‌ను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఐదేళ్లపాటు కార్పొరేటర్‌గా పని చేసినందుకు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. ఐదేళ్ల కాలంలో తమ తప్పులు ఉంటే మన్నించాలని సహచర సభ్యులను, అధికారులను పలువురు సభ్యులు కోరారు. గతానికి భిన్నంగా చివరి సమావేశం ఆహ్లాదకరమైన వాతావరణంలో కొనసాగింది.

కార్పొరేటర్ల గౌరవ వేతనం పెంచుతూ తీర్మానం చేయండి

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కార్పొరేటర్లు సభ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించేలా చూడాలని అధికారులను కోరారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు వేరే పేర్లతో కాంట్రాక్టులు చేస్తున్నారని, వాటికి చెక్ చెప్పేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్లానింగ్ డిపార్టుమెంట్‌పై తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయన్నారు. కార్పొరేటర్లకు ఇచ్చే గౌరవ వేతనం చాలా తక్కువగా ఉందని, పెంపుదలకు సంబంధించి తీర్మానం చేసి అసెంబ్లీకి పంపించాలని ఆయన సూచించారు.

# రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

**శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం**

**గొప్ప సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దేందుకు ఈ ఉత్సవాలు వేదిక కావాలి**

**పూర్వ విద్యార్థులను భాగస్వామ్యులను చేయాలని సూచన**

**పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన వీసీ**



క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, ఫిబ్రవరి 28 దేశంలో తొలితరం విద్యా సంస్థల్లో ఒకటైన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పూర్వవైభవం తీసుకువస్తామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. శతాబ్ది ఉత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలపై ఆయన శనివారం సాయంత్రం ఎయిర్‌పోర్టు లాంజ్‌లో ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఏయూ ఉపకులపతి, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఎంతో ఘన చరిత్ర ఉందని, వర్సిటీని ప్రపంచంలోనే గొప్ప సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దేందుకు శతాబ్ది ఉత్సవాలు వేదిక కావాలన్నారు. దీనిలో భాగంగా మార్చి 26 నుంచి ఏప్రిల్ 26వ వరకు పూర్వ విద్యార్థులతో మమేకం కావడంతోపాటు వారిని శతాబ్ది ఉత్సవాల్లో భాగస్వామ్యులను చేయాలన్నారు. ఈ ఉత్సవాల్లో వర్సిటీ చరిత్ర ప్రతిబింబించాలన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకునేందుకు ఆయా కమిటీలతో సమన్వయం చేసుకోవాలన్నారు. మీడియా ద్వారా పబ్లిసిటీకి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత విద్యార్థులతో కళలు, సంగీతం, సాహిత్యం వంటి కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ఆయా రంగాల వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు, విద్యార్థులను భాగస్వామ్యులను చేయాలని, ప్రముఖులతో వివిధ అంశాలపై సదస్సులు నిర్వహించాలన్నారు. వందేళ్ల విజన్‌కు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగా ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. వర్సిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, ఏప్రిల్ 26వ తేదీన శతాబ్ది స్థాపన దినోత్సవ అజెండాను వివరించారు. అనుబంధ కళాశాలలను ఈ ఉత్సవాల్లో భాగస్వామ్యులను చేస్తామన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా భారీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దేశ విదేశాల్లో ఉన్న పూర్వవిద్యార్థులను ఆహ్వానించి వారిని భాగస్వామ్యులను చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను ఆహ్వానించి వారితో విద్యార్థులకు ఉపన్యాసాలు ఇప్పించాలన్నారు. చదువుకున్న విద్యాలయానికి ఏదో ఒకటి చేయాలనే ఆశతో ఉన్న ప్రతి పూర్వ విద్యార్థిని ఉత్సవాల్లో భాగస్వామ్యం చేసి, వారి ద్వారా వర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చుకోవాలన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్సిటీలో చదువుకున్న వేలాది మంది అనేక రంగాల్లో స్థిరపడ్డారని పేర్కొంటూ ప్రతి ఒక్కరినీ ఆహ్వానించాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల నిర్వహణను అద్భుత అవకాశంగా తీసుకుని వర్సిటీని అభివృద్ధి చేయాలన్నారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ద్వారా వర్సిటీ గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయాలన్నారు. సమీక్షలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.ప్రణవ్‌గోపాల్, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభి, జీవీఎంసీ, వర్సిటీ, రెవెన్యూ శాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

**మంత్రి ప్రజా దర్బార్**

**పార్టీ కార్యాలయంలో వినతిపత్రాల స్వీకరణ**

**సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని అర్జీదారులకు హామీ**

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ శనివారం ఉదయం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 82వ ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. ఆ సమయంలో సమస్యలు వింటూ వారికి భరోసా ఇచ్చారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పూర్తిస్థాయి వేతన స్కేళ్లను వర్తింపజేయాలని అనకాపల్లి జిల్లాకు చెందిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడతానని చెప్పారు. పునరావాసం కల్పించాలని, పరిశ్రమల్లో ఉపాధి ఉపాధి కల్పించాలని అనకాపల్లి జిల్లా సీతపాలెం గ్రామస్థులు కోరారు. అనకాపల్లి లక్ష్మీదేవిపేటలోని శ్రీదుర్గాదేవి అమ్మవారి ఆలయ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. ఇటీవల ప్రతిపాదించిన ఫ్లైవోవర్ నిర్మాణం వల్ల ఆలయానికి భంగం కలగకుండా చూడాలని కోరారు. రజకుల సమస్యలపై రాష్ట్ర ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు రాజమండ్రి నారాయణ వినతిపత్రం అందజేశారు. ఏయూలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు మంత్రిని కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కొద్దిరోజులుగా తాము ఆందోళన చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేయగా, వర్సిటీ అధికారులతో మాట్లాడతానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చోడే వెంకట పట్టాభి, లొడగల కృష్ణ, తదితరులు మంత్రి లోకేశ్‌ను కలిశారు. పింఛన్ల పంపిణీకి వెళ్లలేదా...అని వెలగపూడి, పట్టాభిని లోకేశ్ ప్రశ్నించగా ఉదయమే రెండు వార్డుల్లో పింఛన్లు పంపిణీ చేసి వచ్చామని చెప్పారు. అనంతరం మంత్రి లోకేశ్ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో బ్లూ జెట్ హెల్త్‌కేర్ కంపెనీ శంకుస్థాపన కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

# పసుపు కొనుగోళ్ల ఆరంభం అదుర్స్

**సీజన్ మొదట్లోనే కిలో కొమ్ములు రూ.135 చొప్పున విక్రయం**

**ధర ఆశాజనకంగా ఉండడంతోగిరి రైతుల ఆనందం**

**– రెండేళ్లుగా ధర తగ్గకపోవడంతో రైతులు, వర్తకుల్లో ధీమా**



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 28: మన్యంలో ఈ ఏడాది పసుపు కొమ్ముల కొనుగోళ్లు ఆశాజనకంగా ప్రారంభమయ్యాయి. గత సోమవారం పెదబయలు, గురువారం గుత్తులపుట్టు, శనివారం హుకుంపేట వారపు సంతల్లో పసుపు కొమ్ముల కొనుగోళ్లు ముమ్మరంగా మొదలయ్యాయి. ప్రారంభంలోనే కిలో రూ.135 ధర ఉండడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం ఏజెన్సీలో కిలో పసుపు కొమ్ములను రూ.130 నుంచి రూ.135కు వర్తకులు కొనుగోలు చేస్తున్నారు. రెండేళ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుత ధర గిట్టుబాటు కావడంపై రైతులు సంతోషంగా వున్నారు. 2019లో కిలో రూ.120 నుంచి రూ.140 వరకు ధర ఉండే పసుపు, కొవిడ్ తర్వాత నుంచి కిలో రూ.65 నుంచి రూ.75 ఉండగా, 2023లో ఘోరంగా రూ.65 కంటే ఒక్క రూపాయి పెరగలేదు. దీంతో పసుపు రైతులు దిగాలు చెందారు. ఏజెన్సీ వ్యాప్తంగా సుమారుగా 25 వేల ఎకరాల్లో గిరిజనులు పసుపును సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది జనవరి నెలాఖరు, ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఏజెన్సీ వారపు సంతల్లో పసుపు కొమ్ముల క్రయవిక్రయాలు మొదలవుతాయి. కానీ ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరులో కొనుగోలు మొదలయ్యాయి.

**ప్రారంభంలోనే జోరుగా క్రయ విక్రయాలు**

ఏజెన్సీ వారపు సంతల్లో ప్రారంభంలోనే పసుపు క్రయవిక్రయాలు జోరందుకోవడం విశేషం. దీంతో గిరిజన గ్రామాల్లో భూమిలోని పసుపును తవ్వడం, దానిని పెద్ద పాత్రల్లో వేసి ఉడకబెట్టడం, తర్వాత ఎండ బెట్టడం చేస్తుండగా, పూర్తిగా ఎండిన తర్వాత వారపు సంతలకు తీసుకువచ్చి విక్రయించుకుంటున్నారు. అలాగే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పసుపు క్రయవిక్రయాలు జోరందుకోవడంతో రాష్ట్రంలోని పసుపు ఇతర దేశాలకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నది. దీంతో దేశీయ మార్కెట్‌లో పసుపు కొనుగోలుకు ట్రేడర్లు ఎగబడడంతో డిమాండ్ పెరిగింది. ఫలితంగా ధర సైతం ఆశాజనకంగా ఉంది. శనివారం హుకుంపేట వారపు సంతలో సుమారుగా వెయ్యి బస్తాల పసుపు కొమ్ములను వి.మాడుగుల, జోలాపుట్ ప్రాంతాలకు చెందిన వర్తకులు కొనుగోలు చేశారు. వాటిని వ్యాన్లలో ఆయా ప్రాంతాలకు తరలించారు. పసుపు కొనుగోళ్లతో హుకుంపేట సంతలో సందడి నెలకొంది.

# ప్రాజెక్టుకు రూ.166.40 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

క్రైం కౌంటర్ న్యూస్, కొండపి, ఫిబ్రవరి 28 పొన్నలూరు మండలం చెన్నిపాడు సమీపంలో పాలేరుపై రూపకల్పన చేసిన సంగమేశ్వరం ప్రాజెక్టు (రిజర్వాయర్)కు రాష్ట్రప్రభుత్వం రూ.166.40 కోట్లు మంజూ రు చేసింది. ఈమేరకు శనివారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ ఇరిగేషన్ ఒంగోలు సీఈ(ప్రాజెక్ట్స్)కి ఉత్త ర్వులు పంపారు. రాష్ట్రస్థాయిలో సంబం ధిత శాఖలకు ఆదేశాలు జారీచేశారు. కాగా 2026–27 తాజా బడ్జెట్‌లో రాష్ట్రప్రభుత్వం ప్రాజెక్టుకి రూ.25 కోట్లు కేటాయించింది. తిరిగి శనివారం రూ.166.40 కోట్లు కేటాయిస్తూ జీవో ఇచ్చింది.

**పట్టువదలని విక్రమార్కుడిలా...**

ప్రాజెక్టు కోసం 2014–19 మధ్యకాలంలో అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రత్యేక శ్రద్ధతో పనిచేశారు. ఆయన కొంతమేరకు నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి కాంట్రాక్టర్‌తో పనులు కూడా తిరిగి మొదలుపెట్టించారు. కొంతమేరకు చేసిన ఆ కాంట్రాక్టర్ తనకు గిట్టుబాటు కాదంటూ పనులను వదిలేశారు. దీంతో తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్ట్‌ను పూర్తిగా గాలికొదిలేసింది. తిరిగి ప్రజా ప్రభుత్వం వచ్చాక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్వామి పట్టుదలతో కీలక నాయకులు, రాష్ట్రప్రభుత్వ అధికారుల వద్దకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తిరిగి ప్రాజెక్ట్‌కు కొత్త ప్రతిపాదనలు తయారు చేయించారు. సాంకేతికపరమైన, ఇతర శాఖల అనుమతుల కోసం ప్రత్యేకంగా ఆయన వెంటపడ్డారు. రోజులతరబడి నిధుల మంజూరు కోసం కృషిచేశారు. ఎట్టకేలకు ప్రభుత్వం ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించింది.

**కృతజ్ఞతలు తెలిపిన స్వామి..**రాష్ట్రప్రభుత్వం సంగమేశ్వరం ప్రాజెక్టుకు రూ.166.40 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు మంత్రి స్వామి వెల్లడించారు.



ఆయన శనివారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కొండపి నియోజకవర్గంలో 9,500 ఎకరాలకు సాగునీరు, 60 గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టు రూపకల్పన చేశారన్నారు. పొన్నలూరు మండలంలోని సంగమేశ్వరం వద్ద పాలేరుపై నిర్మించే రిజర్వాయర్ పూర్తికి రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు సీఎం చంద్రబాబునాయుడికి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల అభివృద్ధికి, వ్యవసాయానికి దన్నుగా, తాగునీటి సమస్యను పరిష్కరించే నియోజకవర్గంలో పెద్ద ప్రాజెకు తన హయాంలో పూర్తిచేసుకోవడానికి అడుగులు పడటం ఆనందదాయకమన్నారు.

# రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ



అనకాపల్లి, ఫిబ్రవరి 28 కూటమి ప్రభుత్వ పాలనలో ఏపీలో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారని, దీనికి కారణం పెట్టుబడిదారులను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుగా చూడడమేనని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాంబిల్లి మండలం సీతపాలెంలో బ్లూ జెట్ హెల్త్ కేర్ ఫార్మా యూనిట్‌కు శనివారం ఆయన శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్యుతాపురం– రాంబిల్లి సెజ్‌లో భారీ ఔషధ పరిశ్రమ ఏర్పాటుకు అంకురార్పణ జరిగిందన్నారు. రూ.2,300 కోట్ల మేర పెట్టుబడులు, 1,750 ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఒప్పందం కుదిరిందని తెలిపారు. ప్రత్యేక ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగంలో బ్లూ జెట్ పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు ఉన్నందున ప్రభుత్వం 102.48 ఎకరాల భూమిని ఆలస్యం చేయకుండా కేటాయించిందన్నారు. మూడు దశల్లో ఫార్మా కంపెనీని నిర్మించనున్నారన్నారు. తొలుత మంత్రి లోకేశ్‌కు కంపెనీ ప్రతినిధులు, కూటమి నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని శిలాఫలకాన్ని మంత్రి నారా లోకేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు ప్రాజెక్టు వివరాలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ఏపీ రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, అర్బన్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, కాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, బ్లూ జెట్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ అక్షయ్ బన్సారీలాల్ అరోరా, మేనేజింగ్ డైరెక్టర్ శివెన్ అరోరా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వేణుబాబు, సహ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేష్ షా, కలెక్టర్ విజయకృష్ణన్, బ్లూ జెట్ హెల్త్‌కేర్ బృంద సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ఏపీఐఐసీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారి ఆలయం ముందు డ్యాన్స్‌లు,,,,వివాదంలో బిగ్‌బాస్ ఫేమ్ గీతూ రాయల్

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 28: తిరుమలలో మరోసారి అపచారం జరిగింది.. నిబంధనలను ఉల్లంఘించి రీల్స్ చేయడం వివాదాస్పదం అయ్యింది. బిగ్‌బాస్ ఫేమ్ గీతూ రాయల్ మరో నలుగురితో కలిసి చేసిన ఓ రీల్ వైరల్ అయ్యింది. తిరుమల ఘాట్ రోడ్డుతో పాటుగా శ్రీవారి ఆలయం ముందు డ్యాన్స్ చేస్తూ వీడియో తీశారు. ఆ రీల్‌ను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. తిరుమలలో టీటీడీ నిబంధనల్ని ఉల్లంఘించి రీల్స్ చేయడం వివాదంగా మారింది. ఖడ్గం సినిమాలోని గోవిందా, గోవిందా అనే పాటకు డ్యాన్స్ చేస్తూ ఈ రీల్ చేశారు. అయితే ఈ రీల్ వైరల్ కావడంతో గీతూ రాయల్ వెంటనే ఇన్‌స్టా నుంచి తొలగించారు. తిరుమలలో నిబంధనలు పాటించాలని టీటీడీ పదే, పదే చెబుతోంది.. అలాగే శ్రీవారి ఆలయం దగ్గర మైక్‌లో కూడా ప్రచారం చేస్తున్నారు. అయినా సరే కొందరు పట్టించుకోవడం లేదు.

టీటీడీ నిబంధనల ప్రకారం.. తిరుమలలో రాజకీయ ప్రసంగాలతో పాటుగా రీల్స్ చేయడం, ఫోటోషూట్‌లు చేయడం వంటి వాటిని నిషేధించారు. ఈ మేరకు తిరుమల శ్రీవారి ఆలయం దగ్గర మైక్‌లో కూడా భక్తులకు తెలిసేలా హెచ్చరిస్తున్నారు. అయినా సరే ఇటీవల కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు.. ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల తమిళనాడుకు చెందిన యువకులు శ్రీవారి ఆలయం ముందు రాజకీయ పార్టీకి సంబంధించిన ఓ ఫ్లెక్సీని తీసుకొచ్చి రీల్స్ చేశారు. ఈ వ్యవహారంపై టీటీడీ స్పందించింది.. వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఈమధ్య కొత్తగా వివాహమైన ఓ జంట తిరుమల శ్రీవారి ఆలయం ముందు ఫోట్‌షూట్ చేశారు. అయితే ఆ జంట తమకు టీటీడీ నిబంధనలు గురించి తెలియదని.. క్షమించమంటూ వీడియోను విడుదల చేశారు. తాజాగా గీతూ రాయల్ శ్రీవారి ఆలయం ముందు రీల్ చేసి వివాదంలో చిక్కుకున్నారు. ఈ రీల్ వ్యవహారంపై టీటీడీ స్పందించాల్సి ఉంది.

# సినిమా



## బతికితే అతడిలా బతకాలి.

విలక్షణ నటుడు జగపతి బాబు తన వ్యక్తిగత, వృత్తి జీవితంలోని పలు కీలక అంశాలపై ఓ ఇంటర్వ్యూలో మనసు విప్పి మాట్లాడారు. తన కెరీర్‌లో ఎదురైన ఆర్థిక కష్టాలను, కుటుంబ బంధాలను, అలాగే తోటి నటులపై తన అభిప్రాయాలను వెల్లడించారు. తన కెరీర్ డౌన్‌ఫాల్ ప్రారంభమైన ఆరు నెలల తర్వాత తాను ఇల్లు కట్టే నిర్ణయం తీసుకున్నానని, ఇది తాను చేసిన పెద్ద తప్పులలో ఒకటిగా చెప్పుకొచ్చారు. ఆ సమయంలో రెమ్యూనరేషన్లు తగ్గి, సినిమాలు ఫ్లాప్‌లు కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డానని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు తన కష్టాలు తెలియకూడదనే ఉద్దేశంతో, భావోద్వేగంతో అప్పులు చేసి ఇల్లు నిర్మించానని. ఈ నిర్ణయం వల్ల 15-20 ఏళ్ల పాటు భారీ వడ్డీలు చెల్లించాల్సి వచ్చిందని, ఇది తన ప్రధాన నష్టమని పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులు తన పరిస్థితిని అర్థం చేసుకున్నారని, ఈ విషయంలో వారు చాలా అండగా నిలిచారని జగపతి బాబు తెలిపారు.సైరా నరసింహారెడ్డి సినిమా షూటింగ్ అనుభవాలను పంచుకుంటూ, రామ్ చరణ్ ప్రొడక్షన్ పద్ధతిని ఆయన ప్రశంసించారు. జార్జియాలో జరిగిన షూటింగ్‌లో యూనిట్ సభ్యులందరినీ, ముఖ్యంగా చిన్నవారిని, చిరంజీవి, రామ్ చరణ్ ఎంత బాగా చూసుకున్నారో వివరించారు. భోజనం, వసతి, పాకెట్ మనీ, ఆరోగ్య సంరక్షణ వంటి అన్ని విషయాల్లోనూ రామ్ చరణ్ చూపిన శ్రద్ధ అభినందనీయమని కొనియాడారు. బడ్జెట్ కంటే ట్రీట్‌మెంట్ ముఖ్యమని రామ్ చరణ్ నిరూపించారని ఆయన తెలిపారు.తన బాల్య స్నేహితుల గురించి ప్రస్తావిస్తూ, వెంకటేశ్, నాగార్జున, చిరంజీవి కుటుంబాలతో తమ కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉందని చెప్పారు. నాగార్జున తనకంటే రెండు, మూడేళ్లు పెద్దవాడని, తన సోదరుడిలాంటి స్నేహితుడని తెలిపారు. నాగార్జున జీవన విధానం పట్ల తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేస్తూ, "నాగార్జునని రెండు రోజులకు ఒకసారి తలుచుకుంటాను. ఎందుకంటే ఆయన జీవితాన్ని నిజంగా జీవిస్తున్నారు. సంపాదించడం, ఖర్చు చేయడం, ఇవ్వడం అన్నీ ఆయనకు తెలుసు. తెలివైనవాడు, ప్రతి విషయంలోనూ పూర్తి నిబద్ధతతో ఉంటాడు" అని ప్రశంసించారు. నాగార్జున ప్రాక్టికల్ ఆలోచనలు, జీవనశైలి తనకు నచ్చుతాయని జగపతి బాబు అన్నారు.






## గుడ్డులోని పచ్చసొన రోజూ తింటే ఏమవుతుంది?

కోడిగుడ్డు మనకు మంచి పోషకాహారం. అందుకే రోజూ గుడ్డు తినమని వైద్యులు పదే పదే చెబుతుంటారు. అయితే చాలా మంది కోడిగుడ్డు పచ్చసొన తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందని భయపడుతుంటారు. అసలు పచ్చసొన తినడం మంచిదేనా? అంటే.. పరిశోధనల ప్రకారం పచ్చసొనలో కొలెస్ట్రాల్ ఉన్న మాట వాస్తవమే. కానీ, ఆహారం ద్వారా వచ్చే కొలెస్ట్రాల్ అందరిలో బ్లడ్ కొలెస్ట్రాల్‌ను పెంచదు. ఆరోగ్యంగా ఉన్నవారు రోజుకు ఒకటి తిన్నా పెద్దగా ప్రమాదం ఉండదు.

ఎగ్ యోక్‌లో కేవలం కొవ్వు మాత్రమే కాదు... విటమిన్  తో పాటు ఐరన్, కాల్షియం మరియు జింక్ వంటి ఆరోగ్యానికి మంచి చేసే పోషకాలు కూడా ఉంటాయి. ఇవి ఎముకల బలానికి, రోగనిరోధక పచ్చసొనలో 'కోలిన్' అనే ముఖ్యమైన పోషకం ఉంటుంది. ఇది మెదడు పనితీరును మెరుగుపరచడంలో, జ్ఞాపకశక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే పెరుగుతున్న పిల్లలకు గుడ్డు ఇవ్వడం మంచిదని నిపుణులు చెబుతారు.

పచ్చసొనలో లూటిన్, జియాక్సంతిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి వయసు రీత్యా వచ్చే కంటి సమస్యలను తగ్గించి, చూపును మెరుగు పరచడానికి సహాయం చేస్తాయి. సాధారణ వ్యక్తులు రోజుకు ఒక పూర్తి గుడ్డు తినడం సురక్షితం. శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు, జిమ్ వెళ్లేవారు డాక్టర్ లేదా ట్రైనర్ సలహాతో ఎక్కువగా కూడా తీసుకోవచ్చు.గుడ్డును ఉడకబెట్టి తినడం అత్యంత ఆరోగ్యకరం. ఆమ్లెట్ లేదా ఫ్రై రూపంలో ఎక్కువ నూనె, ఉప్పు, మసాలాలు చేర్చి తినడం వల్ల గుడ్డతో పాటు పచ్చసొనలోని ప్రయోజనాలు తగ్గుతాయి. మితంగా తీసుకుంటే కోడిగుడ్డు శరీరానికి ఉపయోగకరమైన మంచి పోషకాహారం!

గుండె జబ్బులు, అధిక కొలెస్ట్రాల్ లేదా డయాబెటిస్ ఉన్నవారు పచ్చసొన విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అలాంటి వారు డాక్టర్ సలహా తీసుకోవడం ఉత్తమం.



## చియా సీడ్స్ వీరికి విషంతో సమానం.. తింటే ప్రాణాలకే రిస్క్..

వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరచడానికి మనం వివిధ రకాల పానీయాలు, స్మూతీలలో చియా విత్తనాలను కలుపుకుని తాగుతుంటాం. ఇందులో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, ఫైబర్, కాల్షియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి, బరువు నియంత్రణకు చాలా మంచివి. అయితే ఆరోగ్యానికి మేలు చేసే చియా విత్తనాలు కొంతమందికి మాత్రం ప్రాణసంకటంగా మారవచ్చు. చియా విత్తనాలు ఎవరికి హానికరం, వాటిని ఎలా తీసుకోవాలో నిపుణుల అనేది తెలుసుకోవడం చాలా ముఖ్యం.

వీరు చియా విత్తనాలకు దూరంగా ఉండాలి:

రక్తాన్ని పల్చబరిచే మందులు వాడేవారు: మీరు రక్తం గడ్డకట్టకుండా ఉండేందుకు ఆస్పిరిన్, వార్ఫరిన్ వంటి మందులను ఉపయోగిస్తుంటే, చియా విత్తనాలను అస్సలు తినకూడదు. చియాలోని ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు రక్తాన్ని మరింత పల్చబరిచి అంతర్గత రక్తస్రావానికి దారితీయవచ్చు.

మూత్రపిండాల వ్యాధి ఉన్నవారు:

చియా విత్తనాలలో పాస్పరస్ ఎక్కువగా ఉంటుంది. కిడ్నీ సమస్యలు ఉన్నవారికి ఇది చాలా ప్రమాదకరం. ఇది కిడ్నీలపై అదనపు ఒత్తిడిని పెంచి ఆరోగ్యాన్ని మరింత దిగజార్చుతుంది.జీర్ణ సమస్యలు ఉన్నవారు:

ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్, దీర్ఘకాలిక గ్యాస్, ఉబ్బరం, కడుపు నొప్పి లేదా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారు వీటిని నివారించాలి. వీటిలోని అధిక ఫైబర్ కంటెంట్ ఈ లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది.

అలెర్జీ ఉన్నవారు

కొంతమందికి గింజల వల్ల అలెర్జీ ఉంటుంది. చియా విత్తనాలు అరుదుగానైనా చర్మంపై దురద, వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా జీర్ణకోశ సమస్యలను కలిగిస్తాయి.

భద్రతా చిట్కాలు

ఆరోగ్యవంతులు కూడా చియా విత్తనాలను తినేటప్పుడు ఈ జాగ్రత్తలు పాటించాలి:

ఎప్పుడూ నేరుగా తినకండి: చియా విత్తనాలను పొడిగా తినడం వల్ల అవి గొంతులో లేదా ఆహార పైపులో అతుక్కుపోయి ఉక్కిరిబిక్కిరి అయ్యే ప్రమాదం ఉంది.

నానబెట్టి మాత్రమే తినండి: తినడానికి ముందు వాటిని కనీసం 20 నుండి 30 నిమిషాల పాటు నీటిలో లేదా పాలలో నానబెట్టి, అవి జెల్ లాగా మారిన తర్వాతే తీసుకోవాలి.

## టాస్ గెలిచిన శ్రీలంక, పాక్ టార్గెట్ 200

ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026 సూపర్ 8లో భాగంగా ఈ రోజు పాకిస్తాన్ - శ్రీలంక మధ్య రసవత్తర మ్యాచ్ జరుగుతోంది. గ్రూప్ 2లో ఇదే ఆఖరి మ్యాచ్ కావడం, పాకిస్తాన్‌కు చావో రేవో పరిస్థితుల్లో ఈ మ్యాచ్ ఆద్యంతం ఆకట్టుకునే పరిస్థితి ఉంది. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ భారీ తేడాతో గెలిస్తే సెమీఫైనల్‌కు వెళ్లే అవకాశం ఉంది. ఒకవేళ ఓడిపోతే సూపర్ 8 నుంచి నిష్క్రమించనుంది. మరోవైపు శ్రీలంక ఇప్పటికే టోర్నీ నుంచి ఎలిమినేట్ అయింది.

పల్లెకెలె ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీలంక జట్టు కెప్టెన్ శనక బౌలింగ్ ఎంచుకున్నాడు. దాంతో పాకిస్తాన్ జట్టు తొలుత బ్యాటింగ్‌కి రానుంది. ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. మ్యాచ్ లైవ్ స్టార్ స్పోర్ట్స్, జియో హాట్ స్టార్ వేదికగా వీక్షించొచ్చు.

ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ తొలుత బ్యాటింగ్ చేస్తే మినిమం 151-198 పరుగులు పైగా చేసి, 64కి పైగా పరుగుల తేడాతో విజయం సాధించాల్సి ఉంటుంది. లేకపోతే 103-150 పరుగుల మధ్య చేసి 63కి పైగా పరుగుల తేడాతో గెలవాలి. ఒకవేళ తొలుత బౌలింగ్ చేస్తే శ్రీలంకను 153-163 పరుగుల లోపు కట్టడి చేసి 13.2 ఓవర్లలో ఛేజింగ్ చేయాలి.. లేకపోతే 176-186 టార్గెట్ ఉంటే 13.4 ఓవర్లలో ఛేజ్ చేయాలి. కానీ ఈ మ్యాచ్‌లో పాక్ చేస్తుంది కాబట్టి చేయాల్సి ఉంటుంది.

టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో శ్రీలంక - పాకిస్తాన్ జట్లు పోటాపోటీగా ఉన్నాయి. ఈ రెండు జట్లు టీ20 వరల్డ్‌కప్ వేదికలపై నాలుగు సార్లు తలపడితే పాకిస్తాన్ రెండు సార్లు విజయం సాధించగా, శ్రీలంక రెండు సార్లు గెలిచింది. అయితే ఇరు జట్ల మధ్య జరిగిన నాలుగు మ్యాచ్‌లలలోనూ నువ్వా నేనా అన్నట్టు తలపడ్డాయి.

ఈ టోర్నీలో గ్రూప్ స్టేజ్‌లో శ్రీలంక మూడు విజయాలతో సూపర్ 8లో అడుగుపెడితే, పాకిస్తాన్ కూడా మూడు విజయాలు సాధించింది. సూపర్ 8లో శ్రీలంక ఆడిన రెండు మ్యాచ్‌లలో ఓడిపోతే.. పాకిస్తాన్ ఒక మ్యాచ్‌లో ఓడగా, మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ప్రస్తుతం ఒక పాయింట్‌తో ఉన్న పాక్, ఈ మ్యాచ్‌లో ఘన విజయం సాధిస్తే సెమీస్‌కు వెళ్లనుండగా.. న్యూజిలాండ్ ఇంటిదారి పట్టనుంది. ఈ రోజుతో గ్రూప్ 2 నుంచి సెమీస్‌కి వెళ్లే రెండో జట్టు ఫైనల్ కానుంది.

పాకిస్తాన్ జట్టు

షాహిబ్‌జాదా ఫర్హాన్, ఫఖర్ జమాన్, సల్మాన్ అలీ ఆఘా (కెప్టెన్), ఖవాజ్ నఫాయి, ఉస్మాన్ ఖాన్, షాదాబ్ ఖాన్, మొహమ్మద్ నవాజ్, నసీమ్ షాఫ్, షాహీన్ షా అఫ్రిది, అబ్రార్ అహ్మద్, ఉస్మాన్ తారిఖ్.

శ్రీలంక జట్టు

పాతుమ్ నిస్సంక, కుశాల్ మిషారా, చరిత అసలంక, కుశాల్ మెండిస్, పవన్ రత్నాయకే, కమిందు మెండిస్, దాషున్ శనక (కెప్టెన్), దునిత్ వెల్లలాగే, జనిత్ లియానగే, దుష్మంత చమీరా, మహీష్ తీక్షణ, దిల్షాన్ మధుశంక.




## చరిత్ర సృష్టించిన జమ్మూ కశ్మీర్

భారత దేశీయ క్రికెట్ చరిత్రలో జమ్మూ కశ్మీర్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. తొలిసారి రంజీ ట్రోఫీ కిరీటాన్ని గెలుచుకొని దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. ఎన్నో ఏళ్లుగా రాజకీయ, సామాజిక సవాళ్ల మధ్య సాగిన ఈ రాష్ట్రానికి, ఈ విజయం ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. ఫిబ్రవరి 28న మధ్యాహ్నం 2.11 గంటలకు కెప్టెన్లు హ్యాండ్‌షేక్ చేసుకున్న క్షణంతో ఫలితం అధికారికమైంది. తొలి ఇన్నింగ్స్‌లో 291 పరుగుల భారీ ఆధిక్యంతో జమ్మూకశ్మీర్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. 91వ సీజన్ రంజీ ట్రోఫీలో ఇది వారి తొలి టైటిల్ కావడం విశేషం.

ఫైనల్‌లో జమ్మూ కశ్మీర్ దాడికి కర్ణాటక నిలబడలేకపోయింది. పోరాడతామని చెప్పినప్పటికీ చివరి రోజున కర్ణాటక పెద్దగా పోరాటం చూపలేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 160 పరుగులు చేసిన మయాంక అగర్వాల్ జట్టుకు ప్రధాన అండగా నిలిచినా, ఫలితం లేకుండా పోయింది. పిచ్ స్లోగా ఉండటం, బౌలర్లకు అనుకూలంగా లేకపోవడంతో కర్ణాటక ఆశలు క్రమంగా కరిగిపోయాయి. ఉదయం సెషన్‌లోనే కేఎల్ రాహుల్‌తో బౌలింగ్ చేయించటం కర్ణాటక పరిస్థితిని ప్రతిబింబించింది. ప్రధాన పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ కూడా చివరి రోజు బౌలింగ్‌కు రాకపోవడం గమనార్హం.

చివరి రోజుకు 477 పరుగుల ఆధిక్యంతో దిగిన జమ్మూ కశ్మీర్ బ్యాటర్లు మ్యాచ్‌ను ఫార్మాలిటీగా ముగించారు. కమ్రాన్ ఇక్బాల్ అజేయంగా 160 పరుగులు చేయగా, సాహిల్ లోత్రా 101 పరుగులతో శతకం సాధించాడు. దీంతో మళ్లీ బౌలింగ్ చేయాల్సిన అవసరం లేకుండా జట్టు విజయాన్ని ఖరారు చేసుకుంది.

ఈ టోర్నీలో జమ్మూ కశ్మీర్ దేశవ్యాప్తంగా బలమైన జట్లను ఓడించింది. ముంబై, ఢిల్లీ, మధ్యప్రదేశ్, బెంగాల్ లాంటి హేమాహేమీ జట్లను మట్టికరించి కశ్మీర్ ఫైనల్‌కు చేరింది. బౌలింగ్‌లో ప్రధాన పాత్ర పోషించిన ఆకిబ్ నబీ నాకౌట్ దశల్లో ఐదు వికెట్లతో నాలుగు సార్లు మెరిసి, సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. జట్టు కెప్టెన్ పరాస్ డోగ్రా కూడా ఈ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 24 ఏళ్ల కెరీర్‌లో మూడు జట్లకు ప్రాతినిధ్యం వహించి, 10 వేలకుపైగా పరుగులు చేసిన తర్వాత తొలి రంజీ టైటిల్ అందుకోవడం అతడి ప్రయాణానికి మకుటంగా నిలిచింది. మొత్తంగా చూస్తే జమ్మూ కశ్మీర్ ఆల్‌రౌండ్ షోతో ఛాంపియన్‌గా నిలిచింది.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com